# పాటు

రామ్మూర్తికి చేదు మింగడం చిన్నప్పటి నుంచీ అలవాటే. ఆ చేదుతో కించిత్ విషాదాన్ని భరించగలడు.

చేదునయినా, విషాదాన్నయినా అతి చిన్న వయసు నుంచి బొట్టూ బొట్టూ, చిటికెడూ చిటికెడూ మింగుతుంటే చివరకు దుస్సహం కాకుండా పోతుంది అంటారు తెలిసిన వాళ్లు.

తండ్రి చనిపోయిన కొత్త.

గుండు, దారిద్ర్యం.

గుండుండు, గోళకుండు అని ఏదో పాఠంలో వచ్చిన కొత్త మాటలు కొందరు సహపాఠులు అతనిని గురించి వాడడం – ఆ మాటలకు అర్థం తెలుగు మాష్టారు చెప్పగా తెలిసిన రామ్మూర్తి వినడం – ఆ చేదు విషాన్ని మింగడం నాకు బాగా గుర్తుంది.

బంధువులింట పొరుగూళ్లో తల్లి తలదాచుకుంది. రామ్మూర్తి మరో బంధువు ఇంట్లో చదుతున్న నాలుగవ ఫారంకొనసాగించాడు.

తండ్రిపోయిన కొత్తలో చూపబడిన ఆదరణ కడవరకు చూరగొనలేకపోవడం సహజమే. రెండు నెలలు తిరగకుండా రామ్మూర్తికి వారాలు కుదర్చబడ్డాయి.

''వారాలబ్బాయ్ వచ్చాడోచ్!'' అని తోటిపిల్లలు లోపలకి కబురు చేరవేస్తుంటే కడుపులో మొదట కెలికినట్టు అనిపించినా, క్రమేణా అది అలవాటు అయిపోయింది.

'వీడిగుండూ – వీడూ – మంచి బట్టలు వేసుకోకూడదూ !'' అని తోటిపిల్లలు ఛీత్కరిస్తూ ఉంటే అతని కళ్లవెంట నీళ్లు వచ్చేవి కావు.

ఒంటి గంటవరకూ భోజనానికి వేచి వుండాల్సి వచ్చినా, ఆకలితో చుట్టుకుపోకుండా ఓర్మి వహించడం నేర్చేసుకున్నాడు.

'భోజనం ఆలస్యమవుతుంది. వీడికి పాపం ఆకలేస్తుందేమో!' అని కనికరించి ఓ తల్లి బేడ డబ్బులిస్తే రెండు ఇడ్లీ తినేవాడు బుద్ధిగా.

ఏది ఎలా వస్తే అది అనుభవించడమే అతనికి అలవాటు. హైస్కూలు చదువు అయిపోయింది పరీక్ష పాసయ్యాడు.

బడుగు జనోద్ధరణకి మహానాయకులు కంకణాలూ, తొడుగులూ కట్టుకొని రోజులు కాబట్టి కాలేజీలో సీటు దొరికింది. తన బీదరికాన్ని గురించి కొత్తగా వచ్చిన యువకలెక్టర్‌కు నేరుగా విన్నవించుకున్న రామ్మూర్తికి ఆయన సొంత చేతులతో, సొంత టైప్‌మిషన్‌పై కొట్టి ఇచ్చిన సిఫారసు ఉత్తరం సింహాచలం దేవుడి సత్రం అధికార్లకి అందచెప్పడంతో సత్రంలో పద్దూపడింది.

బియ్యే పూర్తయ్యింది. చిన్న ఉద్యోగమూ దొరికింది. అక్కడి నుంచి రామ్మూర్తి దశ మారిందన్నారు కొందరు.

బీదరికందేం వుంది ! చదువు విలువ చదువుకి ఉండనే ఉంది అన్నారు మరి కొందరు.

ప్రయోజకుడయ్యాడని కొందరంటే – తండ్రి ఉంటే చూసుకుని సంతోషించే వాడని మరికొందరంటే – ఆ తండ్రి ఉంటే వీడు కాలేజీ మెట్లెక్కునా అని కొందరు వితర్కించారు.

''రామ్మూర్తి గురించి మీకు తెలుసా ? వెధవల్లారా ! అలా చదువుకోవాలి. చదివే ఇంతోటి చదువుకే తలమీద పంఖా, గొట్టపు దీపమూ ఇవన్నీ కావాల్సి వచ్చాయా !''

కొంత మంది విచిత్రంగా బయట పెడుతున్న దర్జాను నిర్లిప్తతతో వినడం రామ్మూర్తికి ఏనాటి నుంచో అలవాటే.

వివాహితుడై పిల్లల తండ్రి అయ్యాక కూడా అతని గతం అతన్ని వెంటాడుతూనే ఉండేది. ఎక్కడో అడపా, తడపా మెచ్చుకోలు వినపడినా చాలా చోట్ల నుంచి ''వీడికింత పొగరా ! గతం మరచిపోయిన వెధవ'' అన్న మాటలు వినవచ్చేవి.

రామ్మూర్తి కూతురు కాలేజీ చదువయి పెళ్లికెదిగింది. కొడుకు కాలేజీకి ఎదిగాడు.

ఎవరెవరు తన గతం గురించి ఎలా చెవులు కొరుక్కున్నా తలదించుకునిపోయే స్వభావంగా మలచుకున్నాడు రామ్మూర్తి. తన పనేమిటో అదే ధ్యాస.

నాలుగు రాళ్లు వెనకేసుకున్నాడు. వ్యసనాలకు దూరంగా ఉన్నాడు. తృప్తి కంటె స్వర్గం లేదని తెలుసుకున్నాడు. పొదుపులోని విలువ వంట పట్టించుకున్నాడు.

– మనిషి పుట్టుకతోనే భయం ముందు పిల్చుకుంటాడేమో.

కొందరికి గాలివానంటే భయం. కొందరికి పిడుగంటే భయం. మరి కొందరికి నీళ్లంటే భయం.

రామ్మూర్తికి ఒకే ఒక భయం –

ఇతరుల దయమీద అతను బ్రతికాడు. ఆ రోజులు పూర్తిగా మారిపోయాయి. ఇక దయ పుస్తకాల్లోనే – నాయకుల మాటల్లోనే ఉంది....

కానీకి కొరగాని మనిషి బ్రతికే అవకాశమే లేదని అతనికి తెలుసు. అతి భయంకరమైనది మృత్యువు కాదు – బీదరికం – దారిద్ర్యం !

భయం భయంగానే రామ్మూర్తి ముందడుగు వేస్తూ వచ్చాడు.

ఇటీవల ఇంతకు ముందెన్నడూ లేని బంధువులు పుట్టుకొచ్చారు.

తన బీదరికంలో మొహాలు చాటు చేసుకున్న మనుషులు ఇప్పుడు కుప్పతెప్పలుగా బయటకు రావడం చూసి చెరువు నిండడంతో కప్పలు పదివేలని శతకకారుని సూక్తి గుర్తు తెచ్చుకుని కిమ్మనకుండా ఊరుకున్నాడు రామ్మూర్తి.

ఉన్నది జిల్లా కేంద్రం. రామ్మూర్తి స్వార్జితంతో కొనుక్కున్న ఇల్లు.

తనది 'కొంప' అని రామ్మూర్తి అంటూ ఉండడం పరిపాటే అయినా అది మరీ అంత కొంపేమీ కాదు.

సిమ్మెంటు బస్తా పదకొండు రూపాయలున్న రోజుల్లో కొన్న మూడు వందల గజాల స్థలంలో మేడ – ఇప్పుడు లక్షయినా ఆశ్చర్యమేముంది ?

రామ్మూర్తి కొడుకు బికాంలో చేరాడు. కూతురు బియస్సీ పాసయి ఇంటిలో ఉండలేక – బయటకు వెళ్లలేక ఇంట్లో తోచక ఇబ్బందిపడుతూ ఉంది.

ఇహ చుట్టాలు – పక్కాలు. ఇంటిలో ఏదో ఒక సందడి. తన ముందు పొగడ్త వాక్యాలు చెబుతున్నా వెనక ఏవగించుకుంటున్న చుట్టాల సంగతి రామ్మూర్తికి తెలియకపోలేదు.

తనెప్పుడో కష్టాలు పడి చదువుకున్నందుకు వీళ్లందరికీ అడుగులకు మడుగులొత్తవలసిన అవసరం

తనకి లేదు. ఏదో రెండు మూడు రోజులు పబ్బం గడుపుకోడానికి వచ్చినవాళ్లు వచ్చినట్టూ ఉండక ఆర్వాలూ, పూర్వాలూ ఎత్తి పోస్తుంటే రామ్మూర్తికి ఇటీవల ఓర్పు కాస్త సడలుతున్నట్టు కనపడుతోంది.

మార్పు తనలో వస్తున్నట్టు చాలా రోజుల వరకు అతనే గ్రహించలేకపోయాడు.

పిల్లలకీ భార్యకీ అతనంటే భయం ఉండేది. కాని రానురాను అది కొంచెం సడలుతున్నట్లనిపించేది రామ్మూర్తికి.

పిల్లల్ని ఏనాడూ మాటయినా అని ఎరుగని అతను బిడ్డల మీద విసుక్కుంటున్నాడు. చుట్టాలకు అది తమ మీద విసురేమోననిపించేది.

భార్యమీద విసుక్కుంటే ఆమె ఓ రోజు అందుకుంది. ''మనకెవ్వరున్నారు !...... నలుగురిలో పొత్తుగా ఉండాలి. బంగారు పళ్లానికయినా గోడ చేరువ కావాలిగా ! పిల్లలు పెద్దవాళ్లవుతున్నారు. మనమూ పదిమందిలో పడ్డాం....''

ఈ విసురుకు రామ్మూర్తికి ఆశ్చ ర్యం కలిగింది.

''నాన్నా ! నాకు పాలియస్టర్ బట్టలే కావాలి'' అని బాబీ అన్నపుడు రామ్మూర్తి ఏమీ అనకుండా బజారుకు వెళ్లి వాడికి కావలసిన రకాలు తీసేవాడు.

అమ్మాయి అదేదో చీర కావాలంటే కాదనలేదు.

కాలేజీలో చేరిన తరువాత అబ్బాయి అడిగిన వస్తువిశేషాలు వేలకిమ్మత్తుకెళ్లాయి. ఆ సందర్భంలో రామ్మూర్తి భార్యతో ఏకాంతంలో తన భయం వ్యక్తం చేశాడు. ఇలా మనం బ్రతకడానికి పన్నెండు నుంచి పదిహేను వందలవుతున్నాయి. ఈ స్థాయి జీవితం మనవాళ్లకి అలవాటుపడడాన్ని మనం తప్పించలేం....కాని దీన్ని వాళ్లు నిలబెట్టుకోకుంటే అమ్మాయి పెళ్లికి ఖర్చు ఎంతవుతుందో ! ఇక బాబీ కనీసం ఓ బ్యాంక్‌లోనో, ఎల్ ఐసీ లోనో ఆఫీసర్ అవ్వాలి. లేకపోతే వాళ్లు ఈ మాత్రంగా బ్రతకలేరు. అది మనం వాళ్లకు నచ్చచెప్పడం న్యాయం. ఆడవాళ్లు ఏది చెప్పినా హత్తుకునేటట్లు చెప్పగలరు.'' అని మెల్లగా ప్రారంభించాడు.

ఆవిడ ఏ కళనుందో సర్రుమంది. మీరు ఎప్పుడో ఏమో కష్టపడ్డారని వాళ్లు అలాగే ఉండాలంటే అది ఎవరు చెప్పిన మాట ? వాళ్లు అదృష్టవంతులు !

సర్దుకోవడం అలవాటయిన మనిషి కాబట్టి అక్కడికి ఆ సంభాషణ వదిలేశాడు.

– క్రికెట్ మ్యాచ్ చూడడానికి నూరు రూపాయలిచ్చి రెండు టిక్కెట్లు కొనమన్నారు పిల్లలు. రామ్మూర్తికి కోపం ఆగలేదు.

తనేమిటి తన అంతస్తేమిటి ? కేవలం విలాసంగా చూడడంకోసం వంద రూపాయలా ? తను ఉద్యోగంలో జేరిన కొత్తలో వందరూపాయలతో సంసారం లాగుకొచ్చేవాడు.

ఎక్కడో దగ్గర గట్టిగా చెప్పాల్సి ఉంటుందనీ ఇది తన సహనానికీ సర్దుకుపోయే లక్షణానికీ అవధి అని తెలుసుకుని ముక్తసరిగా మూడు నిముషాలలో తను ఎలా పెరిగిందీ, ఇప్పటి స్థాయిలో వాళ్లు జీవించాలంటే చిన్నతనంలోనే ఉన్నవాళ్లు ఎంత కృషిచేయాల్సి ఉన్నదీ చెప్పాలనుకున్నాడు రామ్మూర్తి.

కాని నిగ్రహించుకున్నాడు. బయట గదిలోనుంచి వాళ్ల మాటలు వింటూ పేపర్లో యువత శీర్షిక చదువుకుంటున్నాడు.

''చూడమ్మా ! నాన్న .... వందరూపాయలు అడిగితే కిమ్మనకుండా ఊరుకుని పేపర్లో తలదూర్చేశారు.... ఎంచక్కా సరోజా, మాలినీ, గాయత్రీ బయలుదేరుతున్నారు. వాళ్ల అన్నలతో, తమ్ముళ్లతో, నాకు తమ్ముడున్నాడు. నాకేం లోటు... మేమూ వెళతాం.... ఎప్పుడూ నాన్నకి జాగ్రత్తే ! అంత జాగ్రత్త ఉన్న మనిషి... ఇంటి ఖర్చేమయినా తగ్గించగలుగుతున్నారా ? పాలనీ, నెయ్యినీ వందలు పోసి కొనుక్కుంటున్నాం... తిండే ముఖ్యమా ? సరోజవాళ్లు ఏం తింటేనేం ? బయటకు వచ్చేటప్పుడు నీట్‌గా, ట్రిమ్‌గా.... స్టయిల్‌గా... సినిమాల్లోలాగా....''

కూతురు విశేషణాల గుత్తుళం గుచ్చింది.

''అది కాదే ! తిండి ప్రధానమనుకునే మనుషులతో మనం ఏం చెప్పగలం !.... బయటకు దర్జాగా కనబడడం కూడా అవసరమే కదా ! పోనీ మరేం చేస్తాం... మన బ్రతుకు ఇంతే !''

బాబీగాడి గొంతులో దుఃఖం గురగురలాడింది.

–రామ్మూర్తి భార్యమాత్రం ఊరుకుందా ? పూర్వమంటే భర్తకి తగు విధేయురాలిగానే ఉన్న ఆ క్షణంలో తన మాటను కూడా భర్త ఖాతరు చెయ్యలేదన్న స్త్రీ సహజమైన ఆత్మాభిమానం దెబ్బతింది.

''ముష్టి వందరూపాయలు... ఒక నెలలో నూనెమనిషికిచ్చిన పాటి కాదు..... ఎందుకు వెధవ డబ్బు! ఉంటే మాత్రం ఏం లాభం ? పిల్లల అచ్చటా ముచ్చటా తీర్చకపోతే ఎలా ? నేనేమైనా బనారస్ చీర అడిగానా, ఎప్పుడయినా కొన్నారా ? ఆయన ఏం తెస్తే అదే కాని ఒక్క రోజు నాకు ఏం కావాలని అడిగారా ?.... హాయిగా ఉద్యోగం చేసుకుంటే ఆడదయినా ఎంత హాయిగా తనకిష్టం వచ్చినట్లు తను ఖర్చుపెట్టుకోవచ్చు.. అందుకే ఈ రోజుల్లో ఆడవాళ్లు ఉద్యోగం చేసుకుంటున్నారు. ఎంత పడి ఉంటున్నా ఆ మాత్రం జాలి ఉంటుందా ఈ మగరాయుళ్లకి, ఎంతయినా పరాధీనమేరా నాయనా నా బ్రతుకు. ఇంతే ! ఆయనతో నే చెప్పను.....''

ఆ మాటలూ విన్నాడు రామ్మూర్తి.

తన నిశ్చలస్థితి తబ్బిబ్బవదు.... కాని అదే అవుతుందేమోనన్న భయం కలుగుతోంది.....

బయటకు బయలుదేరుదామనుకున్నాడు.

కూతురు ముందు వచ్చింది గదిలోకి. చెప్పవలసిందేమో చెప్పింది.

బయటకు వెళ్లిపోయింది. ''ముష్టి వందరూపాయలు కోసం చూసుకున్నార్రా – మరి అడగకు. మన సరదాలు వీళ్లకెలా తెలుస్తాయి. ఇంత క్లుప్తంగా, ఇంత జాగ్రత్తగా ఉండే బదులు చావడం నయం....''

– మరొక్క రెండు నిముషాలలో కొడుకుతో భేటీపడిపోయింది రామ్మూర్తికి.

''అక్క ఏడుస్తోంది నాన్న ! వెధవ వందరూపాయలనగా ఎంత ? అంత మంచి ప్లేయర్స్ మళ్లీ మన ఊరొస్తారా ? మనలాంటి వాళ్లకి చూడడం సాధ్యమవుతుందా ?... పోనీ నాకు వద్దు.... దానికి ఓ యాభై ఇవ్వండి... అది వెళ్లి చూస్తుంది. నాకంటె పెద్దది కదా !.....''

''యాభై రూపాయలంటే ఏమిటో తెలుసా ?'' – దీర్ఘంగా ఉపన్యాసం ఇవ్వడానికి పాల్పడ్డాడు రామ్మూర్తి. కాని అప్పటికే విసురుగా వెళ్లిపోయాడు బాబి.

''వెధవ వందరూపాయల కోసం ముఖం చూసుకున్నారు... పిల్లాడి మనసు బాధపడింది.... మీరెప్పుడో కష్టపడిన వాళ్లు ఇప్పుడు ముష్టి వెధవల్లా.....'' ఇంక ఏదో అనబోయింది ఆవిడ.

రామ్మూర్తికి మొదటిసారిగా వచ్చిన కోపం నేరుగా తారాస్థాయినే అందుకుంది.

ముఖం కందిపోయింది. వడిగా వెళుతున్న రైలులో నుంచున్నట్లు ఒళ్లు తూగుతున్నట్లనిపించింది.

అతని భార్య అదేం గ్రహించినట్లు లేదు. ఆమె విసురుగా గదిలోనుంచి బయటకు వెళ్లిపోయింది.

రామ్మూర్తిలో ఆలోచన మేలుకుంది.

కేవలం తన జాగ్రత్తవల్ల వీళ్ల జీవితాలను సాఫీగా పోయేటట్టు చెయ్యడం సాధ్యమా ?

తల్లిదండ్రుల డబ్బు పిల్లలు ఇప్పుడు కష్టమెందుకుపడాలీ ? తన ఎరుకలో ఎంత మంది ధనవంతుల పిల్లలు దిగజారిపోలేదు.

ఏ జీవి చేసుకున్నది ఆ జీవికే. ధనవంతుడి బిడ్డయినా, బీదవాడి బిడ్డయినా ఆయా వ్యక్తుల, వాళ్ల పూర్వజన్మ సుకృత దుష్కృతాల వల్ల సుఖాలనీ, కష్టాలనీ అనుభవిస్తారు.....

–కాని అలా అని దుబారా చెయ్యడానికి నిజంగా తనకు హక్కు ఉందా ?

పట్టెడు మెతుకుల కోసం నాలుగిళ్లు తిరిగిన ఆ రోజులు ఎలా మరిచిపోవడం ! కాయకష్టం చేసుకోలేని స్థితి.... అవన్నీ మర్ఫురావడం లేదే !

డబ్బు సుఖాన్నీ శాంతినీ ఇవ్వలేదు.... అది కేవలం ఎవరి కర్మనుబట్టి వాళ్లకు వస్తాయి.

–కాని ఇదంతా వేదాంతం.... దీన్ని నమ్మడం వేరు... జాగ్రత్తను వదిలెయ్యడం వేరు....

తన చేతిలో తను చెయ్యగలిగినది చెయ్యక ఆ విధి, వ్రాత..... సుకృతం, దుష్కృతం అని పెద్దమాటలు వల్లె వెయ్యడం ఏం విజ్ఞత !

– ఇంట్లో వాతావరణం ఊపిరాడనివ్వడం లేదు. ఓ వంక తన పిల్లల ఆశలు తీర్చలేకపోతున్నాననే బాధ. ఓ వంక నిరంతరం తను పడుతున్న జాగ్రత్త !

పెద్ద పరుగులకు తను పోలేదు కనుకనే ఈనాడు ఈ మాత్రంగా ఉండగలుగుతున్నాడు !

ఏది ముఖ్యం ? ఏది కాదు ?

తన జాగ్రత్తా ! పిల్లల ఆదరాభిమానాలా ?

–అసలు తనను ముందు తీసుకురాగలిగింది తన ఆలోచనాశక్తే !

కాని అది కుర్రకుంకలకు లేదే !

–ఇన్నాళ్ల వరకూ వాళ్ల మనసులోని ఏ కోరికనీ తను కాదనలేదే! వాళ్లు తన బాధను, తన జాగ్రత్తను అర్థం చేసుకోరే.. ఎలా ? ఎలా ?

ఆలోచన తెగిచావడం లేదు.

రామ్మూర్తి బయటకు నడుస్తుంటే ఎవరూ పట్టించుకోలేదు.

–కేవలం ఐదురూపాయల పావలా కోసం ఎన్నిసార్లు ఎంతమంది దగ్గరకు తిరగాల్సి వచ్చేది–తను హైస్కూల్లో చదువుతున్న రోజుల్లో....

ఎదురుగా కుక్కలబండీ వస్తోంది. బోనులా నిర్మించి అందులో కాళ్లు కట్టేసిన కుక్కల్ని పడేశారు... మునిసిపాలిటీ కుక్కలబండి... గగ్గోలుగా అరుస్తున్నాయి. మూగగా చూస్తున్నాయి. పిల్లలు కేరింతలు కొడుతూ బండి వెంట నడుస్తున్నారు.

–''వీటిని ఏం చేస్తారే ?'' – ఓ పసిపిల్ల అడుగుతోంది.

–గతంలో ముఖ్యంగా తన చిన్నతనంలో తను అనుభవించిన అవమానాలూ, ఇక్కట్లూ,

అగచాట్లూ, క్షణకాలంలో రివ్వున దూసుకొస్తూ కళ్ల ముందు తిరుగుతున్నాయి.

– మూడు రూపాయలు పోగయ్యాయి. గంపెడాశతో లాయర్గారింటిముందు ఆగాడు... గంటసేపు ఆయన ఎదురుగా నుంచున్నాక ఆయన గుమాస్తాకు ఓ ఆర్డరిచ్చాడు... మరో అరగంట గుమస్తా దగ్గర నుంచున్నాక ఆయన చొక్కాపైకెత్తి బనీను జేబులోంచి చిల్లర తీసి లెక్కపెట్టి ఇచ్చాడు అర్ధరూపాయి....

–సెకండ్లలో గతం కళ్ల ముందు సుడులు తిరిగిపోయింది.

తను ఎవరికోసం, ఏ ఆశయంతో ఇంత జాగ్రత్తగా ఉన్నాడు ? అది వీళ్లకి ఎలా చెప్పాలి ? అది వాళ్లకు ఎలా ఆకళింపుకు వస్తుంది ?

రామ్మూర్తి తలదించుకునే నడుస్తున్నాడు.

''హలో రామ్మూర్తీ...'' తనతో హైస్కూలులో చదువుకున్న – తన దరిద్రపు రోజుల్ని కళ్లతో చూసిన ఒకతను పిలిచాడు –

రోడ్డుకు అటుగా వెళ్లాలనుకున్నాడు.

– ఎదురుగా వస్తున్న లారీ – మూడు టన్నుల బరువుతో....

–''అరెరె ! రామ్మూర్తి.... వీడికి రక్తపుపోటుంది... డబ్బు జాగ్రత్త ఎక్కువ మందు తీసుకునేవాడు కాదు....''

'' ఆత్మహత్యేమో ! అంతలా చూసుకోకుండా నడుస్తారా ?......''

''లారీవాళ్లకు కళ్లు కనపడవు....''

''మనిషిని తప్పించడానికి ప్రయత్నం చేస్తే గొర్రెపిల్ల కూడా చచ్చిపోయింది...''

ఈ మాటలేం వినబడలేదు రామ్మూర్తికి. అతనికి ఇంక జాగ్రత్త అవసరమే లేదు.

**యువ**

ఫిబ్రవరి, 1984